సాక్షి హనుమకొండ

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నగం ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. - 8లో▸



పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన

పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 35.1°/23.6°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రజల సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. గురువారం వర్సిటీలోని కామర్స్ విభాగం, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్ విభాగాల వద్ద విద్యార్థులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఆయా విభాగాల మహిళా అధ్యాపకులు డాక్టర్ రమ, మేఘనరావు, పి.అమరవేణి, వరలక్ష్మి, ఎస్ జ్యోతి, మమత, సవితాజ్యోత్స్న, దీపాజ్యోతి, డాక్టర్ సౌజన్య, నీలిమ, ప్రగతి పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్, ఆచార్య నర్సింహాచారి అధ్యాపకులు పాల్గొన్నారు.

21 నుంచి కాకతీయ నృత్య నాటకోత్సవాలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ నృత్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ నాట్య గురు, అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ అలేఖ్య పుంజాల తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర కాకతీయ వైభవం గుర్తు చేస్తూ రాణి రుద్రమ చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాలు ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనృత్య నాటకోత్సవాలను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని వివరించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ తొలిసారి నిర్వహిస్తున్న కాకతీయ సాంస్కృతికోత్సవాలు ప్రవేశం ఉచితమని, కళాభిమానులు పెద్ద ఎత్తున విచ్చేసి దిగ్విజయం చేయాలని కోరారు.

ఇద్దరు తహసీల్దార్లకు స్థానచలనం

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కు శాయంపేట తహసీల్దార్‌గా డిప్యుటేషన్‌పై బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా అక్కడ పనిచేస్తున్న సత్యనారాయణను కలెక్టరేట్‌కు డిప్యుటేషన్‌పై పంపించారు. బదిలీల నిషేధంతో వేతనాల విషయంలో ఇబ్బందులు అవుతాయని, బదిలీల స్థానంలో డిప్యుటేషన్ పేరుతో తహసీల్దార్లకు స్థానచలనం కల్పించినట్లు సమాచారం.

రేపు గార్డ్స్ కౌన్సిల్ సమావేశం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కమ్యూనిటీహాల్‌లో శనివారం ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ (ఏఐజీసీ) బీజీఎం సమావేశం నిర్వహించనున్నట్లు ఏఐజీసీ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ కట్కూరి ప్రవీణ్ తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఫార్మర్ జనరల్ సెక్రటరీ ఎస్పీ సింగ్, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు అఖిలేశ్‌పాండే, రత్నేశ్‌కుమార్, సికింద్రాబాద్ డివిజనల్ ప్రెసిడెంట్లు, సెక్రటరీతోపాటు 200 మంది పాల్గొంటున్నట్లు ఏఐజీసీ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీకట్కూరి ప్రవీణ్ పేర్కొన్నారు.

భారీ వృక్షానికి పునర్జీవం



రీ ప్లాంటేషన్ చేసిన భారీ మర్రి వృక్షం వద్ద మధు, గ్రామస్తులు

ఐనవోలు: వంద ఏళ్ల చరిత్ర కలిగిన భారీ వృక్షం ఇటీవల భారీ వర్షాల కారణంగా నేల కొరిగింది. ఆ శివాల మర్రిచెట్టును ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఎట్టకేలకు గురువారం తిరిగి నాటించారు. ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయ భక్తుల మనోభావాలతో సంబంధం కలిగిన పురాతన శివాల మర్రి దేవతా వృక్షం ఇటీవలి వర్షాల కారణంగా నేలకొరిగిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో కలిసి చెట్టును పరిశీలించారు. భారీ వృక్షాన్ని తిరిగి నాటడం గురించి ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సలహాలు, సూచనలు స్వీకరించారు. పునరుద్ధరణ కోసం ఎన్జీఓలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధు ముందుకు వచ్చి తాను ఆ వృక్షాన్ని తిరిగి నాటిస్తానని తనకు అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. ఫారెస్ట్ అధికారుల సూచనలతో చెట్టుకు పునరుజ్జీవనం కల్పించాలని మధుకు సూచించారు. దీంతో గత మూడు రోజులుగా సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేసి మూడు భారీ క్రేన్‌లు, రెండు జేసీబీల సహాయంతో భారీ వృక్షాన్ని కూలిన చోటే మళ్లీ నాటించి ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శివాల మర్రి పునర్జీవానికి తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధు కృతజ్ఞతలు తెలిపారు.

108 వాహనం తనిఖీ


ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరు పీహెచ్‌సీ ఆవరణలోని 108 వాహనాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మండ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని పరికరాలు, పేషెంట్ల రికార్డులు పరిశీలించారు. అత్యవసర సమయంలో 15 నిమిషాల్లో స్పందిస్తూ, జనవరి నుంచి ఆగస్టు వరకు 960 మంది ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రజల ప్రాణాలు కాపాడడంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈఎంటీలు రవి, సుధాకర్, పైలట్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కామాంధుడు!

నాలుగేళ్లుగా అదే కుర్చీ.. మహిళా సిబ్బందిపై వేధింపులు

టర్మ్ డ్యూటీలో ఏం జరిగింది..?

కొద్ది రోజుల క్రితం టర్మ్ డ్యూటీ పేరుతో తను కన్నేసిన ఓ మహిళా ఉద్యోగికి విధులు కేటాయించారు. సహజంగా సెలవు దినం కావడంతో సదరు ఉద్యోగి కార్యాలయ ఆవరణలో ఉంది. ఆ సమయంలో వక్రబుద్ధితో కార్యాలయానికి వచ్చిన సదరు కామాంధుడు బయట ఉన్న ఉద్యోగిని లోనికి రమ్మని, తన టేబుల్ క్లీన్ చేయమని ఆదేశించాడు. బిక్కుబిక్కుమంటూ లోనికి వెళ్లిన ఉద్యోగి టేబుల్ క్లీన్ చేస్తుండగా క్యాబిన్ డోర్ క్లోజ్‌చేసి సదరు ఉద్యోగినిని లైంగికంగా లోబర్చుకునే ప్రయత్నం చేశాడు. ఆమె మెదట తనను ఏమీ చేయొద్దని ప్రాధేయపడినా వినకపోవడంతో తీవ్రంగా ప్రతిఘటించింది. అటుగా జనం అలికిడి రావడంతో అక్కడినుంచి కామాంధుడు మెల్లగా జారుకున్నట్లు సమాచారం.



- లోపల ఏం చేసినా కనిపించకుండా పకడ్బందీగా సెక్షన్ పార్టిషన్
- సెలవు రోజుల్లో టర్మ్ డ్యూటీ పేరుతో లైంగిక దాడులు..
- జిల్లా ఉన్నతాధికారులకు ఓ ఉద్యోగిని ఫిర్యాదు..
- అతని లీలలు విని అవాక్కయిన జిల్లా ఉన్నతాధికారి
- హనుమకొండ ఐడీఓసీలో కలకలం రేపుతున్న సీనియర్ ఉద్యోగి తీరు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్ (ఐడీఓసీ) భవనంలోని ఓ కీలక ప్రభుత్వ శాఖలో 'సీనియర్' ఉద్యోగి లైంగిక వేధింపులు పరాకాష్టకు చేరాయి. నాలుగేళ్లుగా కుర్చీ వదలకుండా పాతుకుపోయిన సదరు ఉద్యోగి తన చాంబర్‌ను ప్రత్యేక పార్టిషన్‌తో పకడ్బందీగా ఏర్పాటుచేసుకుని కిందిస్థాయి ఉద్యోగినులను వేధిస్తున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కారుణ్య నియామకాలు, డిప్యుటేషన్ల ద్వారా తన కార్యాలయానికి వచ్చిన జూనియర్లను అందులోనూ ముఖ్యంగా మహిళలను బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ చేస్తూ తన అవసరాలను తీర్చుకుంటున్నాడని తీవ్ర స్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతని బారిన పడిన ఉద్యోగినుల్లో ఒకరు ధైర్యం తెచ్చుకుని నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఆ సెక్షన్ సీక్రెట్..

సదరు ఉద్యోగి ఒకప్పుడు కారుణ్యంకింద నియమితులయ్యారు. పరిపాలన భవనంలోని ఓ హాల్‌లో పార్టిషన్ చేసి ఉన్న ఆ సెక్షన్ లోపల ఏం జరిగేది బయటికి కనిపించకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకున్నాడు. అతని హోదాకు అంత సీక్రెట్ పార్టిషన్ ఎందుకు అని కొందరు అభ్యంతరం చెప్పినా తన పంతం నెగ్గించుకున్నాడని ఆరోపణలున్నాయి. అయితే ఈ పకడ్బందీ పార్టిషన్‌లోపల అతను చేసేవి కామకలాపాలుగా గమనించిన కొందరు ఉద్యోగులు తమకెందుకులే అనుకొని మిన్నకుండిపోతున్నారు. ఇటీవల సదరు ఉద్యోగి అరాచకాలు శృతిమించడం.. కామకలాపాల విషయం బయటికి రావడం, ఐడీఓసీలో తీవ్ర చర్చకు తెరలేపింది.

వ్యూహాత్మకంగా తన వలలోకి..

సదరు సీనియర్ ఉద్యోగి కన్ను పడిన వారిని వ్యూహాత్మకంగా తన వలలోకి దింపుకునే వాడని తెలుస్తోంది. ఒంటరిగా సదరు ఉద్యోగి చాంబర్‌లోకి వెళ్లాలంటే మహిళలు హడలి పోతున్నారన్నది ప్రస్తుతం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మాటవినని ఉద్యోగులను వేధించడం, కష్టమైన విధులు కేటాయించడం, ఉన్నతాధికారుల పేరుతో బెదిరించడం, డిప్యుటేషన్ క్యాన్సిల్ చేస్తానని, బదిలీ చేస్తానంటూ ఆగ్రహించడం వంటి వేధింపులు ఇక్కడ చాలా మంది కిందిస్థాయి ఉద్యోగులకు నిత్యకృత్యంగా మారింది. కొందరికి మాత్రం సెలవులో వెళ్లినా అది రికార్డుల్లో నమోదు చేయకుండా మేనేజ్ చేయడం సదరు ఉద్యోగి లీలల్లో ఒకటిగా చెబుతుంటారు. కలెక్టరేట్‌లోని 'సీక్రెట్' క్యాబిన్‌లో ఇతను చేయని అడ్డమైన పని లేదని, సరససల్లాపాలకు అడ్డాగా తయారు చేసుకున్నాడని తీవ్రస్థాయిలో ఆరోపణలున్నాయి.

అధికారులకు ఫిర్యాదు...

అనంతరం పనిదినం రోజు ఓ జిల్లాస్థాయి అధికారి వద్దకు కొందరు కిందిస్థాయి మహిళా ఉద్యోగులు, బాధితురాలి కుటుంబ సభ్యులు వెళ్లి జరిగిందంతా చెప్పి న్యాయం చేయాలని కోరారు. ఈక్రమంలో సదరు అధికారి చెప్పిన తీర్పు కామాంధుడికి సరైన శిక్ష కాదని భావించిన ఉద్యోగులు నేరుగా జిల్లా ఉన్నతాధికారికి కలిసి పరిస్థితి వివరించారని సమాచారం. సదరు కామాంధుడు చేష్టలు విన్న ఉన్నతాధికారి అవాక్కై లిఖితపూర్వకంగా ఇవ్వాలని చెప్పి ఆమెను నుంచి ఫిర్యాదు తీసుకున్నట్లు తెలిసింది. ఇన్నిరోజులు అతనికి భయపడిన మహిళా ఉద్యోగులు ప్రస్తుతం ఒకరిద్దరు నిర్భయంగా ముందుకు వచ్చి కామాంధుడి వేధింపులు, తాము అనుభవించిన నరకయాతన తోటి ఉద్యోగులతో చెప్పుకోవడం కలెక్టరేట్‌లో హాట్‌టాపిక్ అయ్యింది.

టర్మ్ డ్యూటీ చేయాలంటేనే భయంభయంగా..



కార్యాలయంలో సెలవు దినాల్లో టర్మ్ డ్యూటీలు వేస్తుంటారు. ఈ విషయంలో మహిళా ఉద్యోగులు కుటుంబ పరిస్థితుల వల్ల రాలేమని మరికొందరు.. సెలవు దినాల్లో ఒంటరిగా పనిచేయడం ఇబ్బందిగా ఉంటుందని ఇంకొందరు విన్నవిస్తూ ఆ డ్యూటీలు మార్చాలని కోరుతుంటారు. కానీ, ఆ సీనియర్ ఉద్యోగి పదేపదే మహిళలకు అదే డ్యూటీ వేసి... కార్యాలయంలో ఏ పనిలేకున్నా తాను సైతం వచ్చి వారిని లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ వ్యవహారంలో బాధిత ఉద్యోగులు ఏం చేయాలో తోచక, ఉద్యోగ భద్రతకు ఇబ్బంది వస్తుందని భావించి కుటుంబ సభ్యులతో బాధలు పంచుకున్న సందర్భాలు ఉన్నాయి.

కొసమెరుపు..

ఓవైపు మహిళా ఉద్యోగులు ఈ వ్యవహారంపై అగ్గిమీద గుగ్గిలమవుతుంటే అదే శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి మధ్యవర్తిగా వ్యవహారం కప్పి పుచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో బాధితులపై అన్ని రకాలుగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై జిల్లాకు బాస్‌గా ఉన్న మహిళా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారని బాధిత మహిళా ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. కొంత కాలంగా తన క్యాబిన్‌నే అడ్డాగా మార్చుకుని చేసిన అక్రమాలు, వేధింపులపై సమగ్ర విచారణచేస్తే ఇతగాడి లీలలు మరిన్ని బయటపడే అకాశం ఉందని చెబుతున్నారు.

కర్షకుల కల్పతరువు..

ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు

- రూ.407.76 కోట్లతో ఆర్థిక లావాదేవీలు
- నేడు 69వ వార్షిక మహాసభ



ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు

ఎల్కతుర్తి: ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం.. రైతుల ఆలోచనలు, స్థానిక పరిస్థితుల నుంచి ఆవిర్భవించిన ప్రాజెక్టు. అప్పటి కరువు పరిస్థితులతో అల్లాడిన రైతులు తమకంటూ ఒక వేదిక ఉండాలన్న ఆశయంతో నెలకొల్పిన సంఘం నేడు వేల కుటుంబాల్లో వెలుగు నింపుతోంది. ఒకప్పుడు అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే రైతులు నేడు నేరుగా వెళ్లి క్షణాల్లో రుణాలు తీసుకుంటున్నారు. గోదాముల్లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు. రైతులకు కావాల్సిన ఎలక్ట్రిక్ పంపుసెట్లు, పైపులైన్లు, సభ్యులకు పెట్రోల్, డీజిల్, సంఘం సభ్యులకు సామాజిక ప్రమాద బీమా పథకం, పంట రుణాలు, బీమా, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబ వారసుడికి లక్ష రూపాయలు, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. రైతులకు ఉపకరణాలు, రుణాలు అందిస్తోందీ బ్యాంకు. శుక్రవారం సంఘం 69వ వార్షిక మహాసభ జరగనుంది.

373 మంది నుంచి 7,549 మంది

ముల్కనూరులో 1956లో 373 మంది సభ్యులతో ముల్కనూరు సహకార గ్రామీణ సంఘం ఒక ఉద్యోగితో ఆవిర్భవించింది. నేడు 7,549 మంది రైతులు భాగస్వామ్యులయ్యారు. ప్రస్తుతం రూ.407.76 కోట్లతో రుణాలు అందిస్తోంది. రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తోంది. పెట్రోల్ బంక్, సూపర్‌బజార్, కాటన్ జిన్నింగ్ ప్లాంట్, సదాక్ రైస్‌మిల్ వంటి వాటిని నిర్వహిస్తోంది. ముల్కనూరు రైస్ రాష్ట్రంలోనే పేరు గడించింది.

పలువురు నేతల సందర్శన..

2006లో జరిగిన సంఘం 50 వసంతాల వేడుకలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. అనంతరం అనేక మంది సందర్శించారు. నేడు రాష్ట్రంలోనే ఒక అధ్యయన కేంద్రంగా మారింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశిరెడ్డి విశ్వనాథరెడ్డి మరణానంతరం సభ్యుల ప్రోద్బలంతో అధ్యక్షుడిగా ఆయన తనయుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఎన్నికై సంఘాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. జాతీయ స్థాయిలో సైతం సంఘం ఉత్తమ సహకార సంఘం అవార్డు పొందింది. ప్రవీణ్‌రెడ్డిని సైతం ఉత్తమ సహకార వేత్త అవార్డుతో వ్యవసాయ విద్యాలయం సన్మానించింది.

రైతుల సమష్టి కృషితోనే..



రైతుల సమష్టి కృషితోనే ముల్కనూరు సహకార గ్రామీణ సంఘం నేడు లాభాల బాటలో పయనించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. నిత్యం రైతుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం పాలకవర్గంతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. పలు పథకాలను సభ్యులకు అందజేస్తున్నాం. సంఘం దినదినాభివృద్ధి చెందుతోంది.

–అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు

కనీస ప్రమాణాలు పాటించాలి

అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాల బాలికలకు నిర్వాహకులు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలన్నారు. ఈనెల 20 నుంచి 26 వరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ బృందం ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ.. సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌రావు, బాల రక్షా భవన్ కో–ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ప్రవీణ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, పరికి సుధాకర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

కలెక్టర్ స్నేహ శబరీష్



బోర్డుపై విద్యార్థితో రాయిస్తున్న కలెక్టర్

పరకాల: విద్యార్థినుల్లో అభ్యసన, పఠన సామర్థ్యాలను పెంచాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. పరకాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలతోపాటు గిరిజన వసతి గృహాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వంట, తరగతి గదులు, డార్మెటరీ, భోజనాన్ని పరిశీలించడంతోపాటు పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థినులతో తరగతి గదిలోని బోర్డులపై రాయించి చదివించారు. చాలా మంది డాక్టర్లు, ఇంజనీర్లు అవుతామని సమాధానమిచ్చారు. అయితే అందుకు కావాల్సిన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థినులకు కలెక్టర్ సూచనలు చేశారు. పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ అర్బన్: క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఇండోర్ స్టేడియం స్టేడియంలో ట్రాన్స్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ చెస్, బాడ్మింటన్ పోటీలు సీఎండీ వరుణ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈ శ్రీరాంకుమార్, ఎస్ఈలు నారాయణరెడ్డి, గౌతంరెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ నీలం జగన్నాథ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు..

చేప పిల్లల పంపిణీకి ముందుకురాని కాంట్రాక్టర్లు

- జిల్లాకు టెండర్ వేసింది ఒక్కరే
- గతేడాది బకాయిలే కారణమా?
- ఆ ఒక్క బిడ్‌ను తెరిచేదెన్నడో?

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు దక్కించుకోవడానికి కాంట్రాక్టర్లు పోటీపడుతుంటారు. అవసరమైతే సిండికేట్‌గా ఏర్పడి ఒక్కరే దక్కించుకుంటారు. అయినా కుదరకపోతే రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తారు. అందుకు పూర్తి విరుద్ధంగా మత్స్యశాఖ ఆహ్వానించిన టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారులు టెండర్లు ఆహ్వానించగా ఒక్కరే దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రతీ ఏటా ఉచిత చేప పిల్లల పంపిణీకి తీవ్ర పోటీ ఉండగా, గతేడాది నుంచి టెండర్లు వేసేందుకు ఒకరు లేదా ఇద్దరి కంటే ఎక్కువ రావడం లేదని మత్స్యశాఖ అధికారిక లెక్కలే చెబుతున్నాయి.



హనుమకొండ జిల్లాలో మొత్తం 813 చెరువులు

హనుమకొండ జిల్లాలో మొత్తం 813 చెరువులు ఉండగా గత సంవత్సరం 763 చెరువుల్లో రూ.82.82 లక్షల విలువైన 111.21 లక్షల ఉచిత చేపపిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. కట్ల, రోహు, బంగారుతీగ, మెరిగ జాతి చేపపిల్లలను చెరువుల్లో వదిలారు. అదే మాదిరి ఈ సంవత్సరం సైతం చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ టెండర్లను ఆహ్వానించింది. టెండర్లకు ఈ నెల 12 చివరి తేదీగా పేర్కొంది.

ఒక్కరే టెండర్ దాఖలు..

ఈ సంవత్సరం జెశ్వంత్ ఆక్వాఫామ్స్ ప్రైవేట్ సంస్థ, భీమారం పేరుతో ఒక్కరే టెండర్ వేసినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే సదరు సంస్థ ఎన్ని చెరువులకు, ఎంతకు కోట్ చేస్తారనే విషయం బిడ్ తెరిస్తే కానీ తెలియదు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ దాఖలైతే తిరిగి మరోసారి ఆహ్వానించాల్సిన అవసరం ఉంటుందని చెబుతున్నారు.

➤ ఇప్పటికే సెప్టెంబర్ నెల సైతం గడిచిపోతోంది. టెండర్లు పూర్తయి చేపపిల్లలు చెరువులకు ఎప్పుడు చేరుతాయనేది మత్స్యకారుల ప్రశ్న.

బకాయిలే కారణమా?

- గతేడాది జిల్లాలోని 813 చెరువుల్లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేసేందుకు రెండు సంస్థలు టెండర్లను దక్కించుకున్నాయి. అందులో ఓబులాపూర్, జఫర్‌గఢ్, జనగామకు చెందిన బైరీ పట్టాభి, సాయినాథ్ ఫిష్ సీడ్ ఫామ్ 571 చెరువుల్లో 84,79,477 చేప పిల్లలను పంపిణీ చేసేందుకు రూ.6,53,170 లక్షలకు కాంట్రాక్టును దక్కించుకుని ఆయా చెరువుల్లో వదిలింది. ఆ మొత్తాన్ని చెల్లించాల్సిన ప్రభుత్వం సదరు కాంట్రాక్టర్‌కు రూ.24,11,1846 లక్షలు మాత్రమే చెల్లించింది. ఇప్పటికీ బైరీ పట్టాభి, సాయినాథ్ ఫిష్ సీడ్ ఫామ్‌కు రూ.41,19,861 లక్షలు చెల్లించాల్సి ఉంది.
- మరో 179 చెరువులకు పంపిణీ చేసేందుకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చెందిన ముల్కనూరు ఫిష్ హాచరీస్ సంస్థ రూ.17,50,321 లక్షలతో 23,85,067 చేప పిల్లల పంపిణీకి టెండర్లను దక్కించుకుని అందజేసింది. ఆ సంస్థకు రూ.5,47,967 మాత్రమే చెల్లించిన ప్రభుత్వం, రూ.12,02,354 బకాయి ఉంది.



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి..

హనుమకొండ జిల్లా పరిధి చెరువుల్లో చేప పిల్లల పంపిణీకి ఒక్కరు టెండరు దాఖలు చేశారు. టెండర్ వేసిన సంస్థకు సీడ్ సరఫరా చేసే సమర్థత ఉందా? లేదా? అనేది ఫీల్డ్ ఎంక్వైరీ చేయాల్సి ఉంది. ఆ తర్వాత బిడ్ తెరవాల్సి ఉంటుంది. గత సంవత్సరం సరఫరా చేసిన సంస్థలకు బకాయి అంశం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

- నాగమణి, ఇన్‌చార్జ్ జిల్లా మత్స్యశాఖ అధికారి, హనుమకొండ

క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● కలెక్టర్ స్నేహ శబరీష్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పోషణ మాసం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, డీఆర్‌డీఓ మేన శ్రీను, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఇక్తాదర్ అహ్మద్, డెమో అశోక్‌రెడ్డి, హన్మకొండ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ విశ్వజ, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, మహిళా సాధికారిత మిషన్ శక్తి కోఆర్డినేటర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

యూరియా వచ్చేసింది..



యూరియాను పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్‌కు గురువారం 1,386.900 మెట్రిక్ టన్నుల స్పిక్ కంపెనీ యూరియా, 507 మెట్రిక్ టన్నుల 20.20.013 రకం ఎరువులు చేరాయి. యూరియా వ్యాగన్‌ను కంపెనీ అధికారులు రమణరెడ్డి, తిరుమల్‌రావులతో కలిసి వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. 1,386.900 మెట్రిక్ టన్నుల స్పిక్ యూరియాను వరంగల్ జిల్లాకు 256, హనుమకొండ 250, ములుగు 240, భూపాలపల్లి 300, జనగామ జిల్లాకు 340 మెట్రిక్ టన్నులు కేటాయించారు.

విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించుకోవాలి

● హనుమకొండ డీఈఓ వాసంతి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించుకోవాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి కోరారు. ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు తాడూరి రమేశ్ ఇచ్చిన రూ.50 వేల విరాళంతో గ్రంథాలయం, గ్రానైట్ యజమాని సత్యనారాయణ ఇచ్చిన రూ.50 వేలతో ల్యాబ్‌ను పీజీ హెచ్‌ఎం బద్దం సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. ఈ మేరకు గురువారం ల్యాబ్, గ్రంథాలయాన్ని ఆమె దాతలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనంతోనే విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దుర్గాభవాని, జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, పాఠశాల చైర్‌పర్సన్ నీరజ, గ్రామ మాజీ సర్పంచ్ రత్నాకర్, ప్రతాప్, రామారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, వెంకటసుహాసిని, పద్మలత, కల్యాణి, రమాదేవి, ప్రసాద్‌రావు, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 72 నెట్‌వర్క్ హాస్పిటల్స్

- వాటిలో 34 ఆస్పత్రుల్లో నిలిచిన సేవలు
- ప్రభుత్వం బకాయిలు చెల్లించాలంటున్న యాజమాన్యాలు
- ప్రతీ రోజు సుమారు 2,500 మంది రోగులకు ట్రస్ట్ వైద్యం



వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో ఖాళీ ఉన్న ఆరోగ్యశ్రీ కౌంటర్

గీసుకొండ: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సగం ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల వారు సేవలు నిలిపివేశారు. ప్రభుత్వం తరఫున వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తక్షణమే బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో సేవలు నిలిపివేస్తున్నట్లు నెట్ వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ వారు ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 72 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా వాటిలో 34 ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేసినట్లు వాటి యాజమాన్యాలు చెబుతున్నాయి. మిగతా ఆస్పత్రుల్లో సేవలు కొనసాగుతున్నాయని, సేవలను నిలిపివేసిన యాజమాన్యాలకు నచ్చజెబుతున్నామని ఆరోగ్యశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ స్వరూప్ తెలిపారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం ఎంత బకాయి ఉందనేది ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పోర్టల్‌లో కనిపించడం లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రులు, ట్రస్ట్ మధ్యనే ఈ లెక్కల వివరాలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రతీ రోజు సుమారు 2,500 వరకు రోగులు పరీక్షలు చేయించుకోవడానికి వస్తుంటారని, వారిలో సుమారు 180 మంది వరకు చికిత్స, ఆపరేషన్లు చేయించుకోవడానికి జాయిన్ అవుతారని తెలుస్తోంది. గత ఏడాది మార్చి నెల నుంచి తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదని ఆస్పత్రుల వారు అంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లా పేరు	నెట్‌వర్క్ ఆస్పత్రులు	సేవలు నిలిపివేసినవి
హనుమకొండ	45	21
వరంగల్	14	10
జనగామ	4	0
మహబూబాబాద్	7	2
భూపాలపల్లి	2	1
ములుగు	0	0
మొత్తం	72	34



ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రి ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తాము భరించలేని విధంగా ఖర్చులు పెరుగుతుండటంతో తప్పని పరిస్థితిలో సేవలను నిలిపివేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని ఆస్పత్రుల వారు సేవలను నిలిపివేయడంతో ఫాదర్ కొలంబో, ప్రతిమ, ఎంజీఎం, కేఎంసీలోని ఆస్పత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాగే, సేవలు కొన్ని రోజులపాటు కొనసాగితే రోగులకు ఇబ్బంది తప్పేలా లేదు. ఈ విషయమై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుంటే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- తల్లి దుర్మరణం.. కుమారుడికి తీవ్రగాయాలు
- డీసీ తండా వద్ద ఘటన



రేశమ్మ(56)

వర్ధన్నపేట: తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లొస్తూ ఓ వృద్ధురాలు అనంతలోకాలకు చేరింది. బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో తల్లి దుర్మరణం చెందగా, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన మున్సిపాలిటీ పరిధి వరంగల్–ఖమ్మం రహదారి డీసీ తండా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కమ్మనపల్లి తండా గ్రామానికి చెందిన గుగులోత్ రేశమ్మ(56) తన కుమారుడు తుకారాంతో కలిసి గురువారం ఉదయం బైక్‌పై రాయపర్తి మండలం టీకే తండాలో జరిగిన తమ బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరంగల్– ఖమ్మం రహదారి డీసీ తండా వద్ద ఆయిల్ ట్యాంకర్ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రేశమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. కుమారుడు తుకారామ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఎంజీఎం తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదెల కాపరి ..

మహబూబాబాద్ రూరల్ : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గేదెల కాపరి దుర్మరణం చెందగా మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర మిల్ తండా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన రేఖ సోమయ్య మేనల్లుడు గంగుల వెంకన్న (42) గేదెలను మేత నిమిత్తం గురువారం ఉదయం మున్నేరువాగు సమీపంలోకి తీసుకెళ్లాడు. రాత్రి సమయంలో తీసుకుని వస్తుండగా నర్సంపేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కంకరమిల్ తండా వద్ద గేదెలను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ మూడు గేదెలు వచ్చి వెంకన్నపై పడగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గేదెలకు వైద్య చికిత్స చేయిస్తున్నారు. అనంతరం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకన్న(ఫైల్)

బొలెరో ఢీకొని అయ్యగారిపల్లిలో రైతు..

కురవి: చేను వద్ద నుంచి నడుచుకుంటూ ఇంటికొస్తున్న ఓ రైతును బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని అయ్యగారిపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పొన్నెబోయిన మధుసూదన్(48) చేను వద్ద పని ముగించుకుని పశువులను ఇంటికి తోలుకొస్తున్నాడు. ఈ క్రమంలో బొలెరో వాహనం మరిపెడ నుంచి కురవి వైపునకు వస్తూ మధుసూదన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మధుసూదన్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.



మధుసూదన్(ఫైల్)

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

న్యూశాయంపేట: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు కొలతల శాఖాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025–26 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరంలో 2లక్షల50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సుమారు 260 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, డ్రైయ్యర్లు, తాగునీరు, టార్పాలిన్లు, గన్నీబ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లో ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369గా ప్రభుత్వం ధర నిర్ణయించిందని తెలిపారు. సన్నరకం ధాన్యం నాణ్యత గుర్తింపునకు గ్రెయిన్ కాలిఫర్(డయల్ మైక్రోమీటరు) అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎం సివిల్ సప్లయిస్ సంధ్యారాణి, డీఎస్‌ఓ కిష్టయ్య, డీఎం సురేఖ, డీఆర్డీఓ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలెక్టర్ సమావేశం

గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే- 163 నిర్మాణంలో భూములు కోల్పోయిన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని తోపనపల్లి, అలంఖానిపేట రైతులతో గురువారం కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన సమావేశం (ఆర్బిట్రేషన్) నిర్వహించారు. రైతులకు అవార్డ్ పాస్ చేసేందుకు ఈ ఆర్బిట్రేషన్ సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, ఏఓ విశ్వప్రసాద్, తహసీల్దార్ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారులకు పదేళ్ల జైలు



వరంగల్ లీగల్ : నలుగురు గంజాయి రవాణాదారులకు 10 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.అపర్ణాదేవి గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హసన్‌పర్తి ఏఎస్సై ఉపేందర్‌రావు 2017, జనవరి 16న మల్లారెడ్డిపల్లి శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించగా పట్టుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా బస్తాలో ఎండు గంజాయి లభించింది. వెంటనే విచారించగా ద్విచక్రవాహనంపై వచ్చిన వారు శాయంపేట మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన నారిగే రాజయ్య, గంగిరేనిగూడెం సూర్యానాయక్ తండాకు చెందిన లావుడ్య భద్రమ్మగా తెలిసింది. గ్రామస్తుడు దుప్పటి మల్లయ్యతో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మల్లారెడ్డిపల్లికి చెందిన రైతులు బొల్ల అయిలయ్య , దాసరి కుమారస్వామి నుంచి కిలో గంజాయి రూ.వెయ్యికి కొనుగోలు చేసి హైదరాబాద్, కదిరి, మహారాష్ట్రకు కిలో రూ.6,500 చొప్పున అమ్మడానికి రవాణా చేస్తున్నామని ఒప్పుకున్నారు. అలాగే, వీరికి కొద్ది దూరంలో మరో రెండు బస్తాల గంజాయితో దుప్పటి మల్లయ్య, బొల్ల అయిలయ్య, దాసరి కుమారస్వామి ఉన్నారని తెలిసింది. పోలీసుల రాకను గమనించిన ముగ్గురు పరారయ్యారు. అనంతరం నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో నలుగురు నేరస్తులు లావుడ్య భద్రమ్మ, దుప్పటి మల్లయ్య, బొల్ల అయిలయ్య, దాసరి కుమారస్వామికి 10 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కాగా, విచారణ సమయంలోనే ప్రధాన ముద్దాయి నారిగే రాజయ్య మృతి చెందాడు. ఈ కేసును పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, కిషన్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి విచారణ పర్యవేక్షించారు. సాక్షులను హెడ్ కానిస్టేబుల్ వి.రవీందర్ కోర్టులో ప్రవేశపెట్టారు.

జైపూర్‌లో స్వచ్ఛతపై అధ్యయనం

వరంగల్ అర్బన్: స్టడీ టూర్‌లో భాగంగా గురువారం రాజస్థాన్‌లోని జైపూర్ నగరాన్ని నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సందర్శించి స్వచ్ఛతపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జైపూర్ మేయర్ సౌమ్య అక్కడ అవలంబిస్తున్న స్వచ్ఛ విధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛతలో 16 వ ర్యాంకు, స్వచ్ఛతాహీ సేవాలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌టీల ద్వారా సుమారు వెయ్యి టన్నుల సామర్థ్యంతో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్వహించి 12 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. వంద శాతం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, వరంగల్ మహానగర పాలకసంస్థకు సారూప్యత ఉందని తెలిపారు. రెండు నగరాలు హెరిటేజ్‌గా, యునెస్కో నుంచి గుర్తింపు పొందాయని వెల్లడించారు. అనంతరం జైపూర్ మేయర్, అధికారులు.. వరంగల్ మేయర్, కార్పొరేటర్లు, అధికారులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

యథావిధిగా గురుకుల టీచర్ల వేతనాలు

● ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హర్షం

న్యూశాయంపేట : మైనారిటీ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్‌టైం టీచర్ల వేతనాల్లో ఒకేసారి జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, కుక్‌లు, కంప్యూటర్ టీచర్లు, పీడీ, పీఈటీ తదితర సిబ్బందికి ప్రభుత్వం సగటున రూ. 5 వేల నుంచి రూ.13 వేల మధ్య వారి వేతనాల్లో భారీ కోత విధించింది. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్‌లోని టెమ్రిస్ ప్రధాన కార్యాలయం ఎదుట, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి సవరించిన వేతనాల జీఓను రివైజ్ చేసింది. దీని ప్రకారం తిరిగి పాత వేతనాలు అందించేందుకు సవరించిన కొత్త జీఓను గురువారం ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా జారీచేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రానున్నాయి. ఈ జీఓ వచ్చే విద్యాసంవత్సరం 2026 మార్చి వరకు అమల్లో ఉండనుంది.

బకాయిలు విడుదల..

రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మైనారిటీ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. దీంతో ప్రభుత్వ ఎట్టకేలకు వారి రెండు నెలల వేతనాలను విడుదల చేసింది. అయితే కోత విధించిన వేతనాల ఎరియర్స్‌ను త్వరలో ఉద్యోగుల అకౌంట్లలో జమ చేయనున్నట్లు టెమ్రిస్ అధికారులు తెలిపారు. ఉద్యోగులు ఆందోళన చెందొద్దని తెలిపారు.

పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన

● కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం కేయూలో నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సామరస్యత, పౌర వ్యవస్థ బలోపేతం లాంటి అంశాలు సమాజ మార్పునకు పునాది రాళ్లు అవుతాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో కార్యకర్తలు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారని ఆహారం, ఔషధాలు కూడా సరఫరా చేశారన్నారు. ఉత్సవ వక్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఖానాపురం ఉదయ్‌కుమార్‌మాట్లాడుతూ దేశంలో సమాజ పరివర్తన వ్యక్తి పరివర్తనతోనే సాధ్యమన్నారు. అందుకు పంచ పరివర్తన కీలకమన్నారు. రిటైర్డ్ ఆచార్యులు చిలుకమారి సంజీవ, జి. దామోదర్, పాలకమండలి సభ్యులు డాక్టర్‌చిర్రరాజు, ప్రొఫెసర్లు స్వర్ణలత, మామిడాల సుధాకర్, డాక్టర్ మంజుల, డాక్టర్ మమత తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన శీతాకాల అతిథి!



బ్లూథ్రోట్ బర్డ్



ప్రకృతి ప్రేమికుడు జగన్

హన్మకొండ అర్బన్: సాధారణంగా శీతాకాలం(అక్టోబర్–మార్చి)లో దక్షిణ ఆసియా, భారతదేశం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), శ్రీలంక వరకు వలస వచ్చే బ్లూథ్రోట్ (నీలగొంతు పిట్ట) ఈ ఏడాది ముందే వచ్చింది. దీని శాస్త్రీయ నామం లూస్కినియా స్వేసికా. ఈ పక్షి ఫొటోను నగరానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు జగన్ కాజీపేట మండలం అమ్మవారిపేట చెరువు సమీపంలో గంటల కొద్ది నిరీక్షించి తన కెమెరాలో బంధించారు. సాధారణంగా శీతాకాలంలో చెరువులు, నీరు, గడ్డిపొదలు, పొలాల అంచుల దగ్గర ఎక్కువగా ఈ పక్షులు కనిపిస్తాయని తెలిపారు. మగపక్షి గొంతు భాగంలో నీలి రంగు ఉంటుంది. అందుకే దీనికి బ్లూథ్రోట్ అనే పేరు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇది చాలా చురుకైన పిట్ట అని, తరచూ తోక కదుపుతూ, కిందికి పైకి ఎగిరి కీటకాలను పట్టుకుంటుందని వివరించారు. దీని కూత మధురంగా ఉంటుందని, కొన్నిసార్లు ఇతర పక్షుల స్వరాలను కూడా అనుకరిస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రకృతి వలసల పరిశోధనలకు ముఖ్యమైన జాతిగా కూడా వివరించారు.

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

- ఐదేళ్ల వయసొచ్చినా మంచానికే పరిమితం
- మానసిక స్థితి బాగాలేని యశ్విత
- ఆస్పత్రులు తిరిగి ఉన్నదంతా ఖర్చు చేసిన తల్లిదండ్రులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

దీన గాథ



కూతురు యశ్వితతో సర్వేశ్ దంపతులు

కాజీపేట: ఆ కుటుంబ పెద్ద దుకాణంలో పనిచేస్తే రోజుకు రూ.200. ఆ ఇంటామె కూలీకి వెళ్తే రూ.300. ఆ కూలీ పని కూడా నెలలో 10 రోజులు దొరకడం కష్టమే. ఇల్లు లేదు. జాగా లేదు. ఉన్నదాంట్లో సర్దుకుపోదామనుకున్న ఆ దంపతులకు.. కూతురు ఆరోగ్యం నిద్రపట్టనివ్వట్లేదు. కాజీపేట పట్టణం బాపూజీనగర్ కాలనీకి చెందిన తోకల సర్వేష్, ప్రేమలత దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె యశ్వత (5) మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇప్పటికీ నడవలేని దుస్థితి. దుకాణంలో జీతం చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న సర్వేష్‌కు కూతురుకు వైద్యం చేయించడం కష్టంగా మారింది. ఇప్పటికే రూ.4 లక్షలు చికిత్స కోసం ఖర్చు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కార్పొరేట్ ఆస్పత్రిలో చూపిస్తే తప్ప పరిస్థితి ఏంటో అర్థంకాదని వైద్యులు సూచించడంతో కూతురును అలా వదిలేయలేక, సరైన వైద్యం చేయించే స్తోమత లేక కన్నవాళ్లు తల్లడిల్లుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన తల్లిదండ్రులు కార్పొరేట్ వైద్యం ఎలా చేయించాలో తెలియక కన్నీళ్లు పెడుతున్నారు. దాతలు ఆర్థిక సాయం అందించి చిన్నారికి ప్రాణం పోయాలని వేడుకుంటున్నారు.

ఆర్థిక సాయం అందించాలనుకుంటే..
కల్వల ప్రేమలత
యూనియన్ బ్యాంక్ కాజీపేట బ్రాంచ్ ,అకౌంట్ నంబర్ **122710100091805**
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యుబీఐఎన్ **0802999**మెయిన్ రోడ్ కాజీపేట
63008 -12559 నంబర్‌కు ఫోన్‌పే చేయవచ్చు.

పత్తి కొనుగోళ్లకు పూజలు



కాంటాల వద్ద పూజలు చేస్తున్న వ్యాపారులు



సూచిక పట్టికలో ధరలు మార్పులు, చేర్పులు చేయని అధికారులు

వరంగల్ చౌరస్తా: పత్తి కొనుగోళ్ల కోసం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పలువురు వ్యాపారులు, అడ్తిదారులు కాంటాల వద్ద గురువారం ప్రత్యేక పూజాలు చేశారు. కొద్ది రోజులుగా కొత్త పత్తి వస్తున్న నేపథ్యంలో పూజలు చేసి, కాంటాలు ప్రారంభించారు.

మారని సరుకుల ధరలతో అయోమయం

రైతులకు మెరుగైన సేవలు అందించడంలో మార్కెట్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజులుగా దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరల మార్పులు, చేర్పులను హాజరు సూచిక పట్టికలో నమోదు చేయడంలో యంత్రాంగం విఫలమైంది. మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి జి.రెడ్డి సెలవుల్లో ఉండటంతో ధరల మార్పులు, చేర్పులు చేసే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పట్టికలో మార్పులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

- కేంద్ర ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్ మంజూరు
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు

హన్మకొండ/హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. వరంగల్‌కు సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 22 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు చేయగా ఇందులో వరంగల్ ఒక్కటి. ఒక్కో వెల్‌నెస్ సెంటర్‌కు జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, జూనియర్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మంజూరయ్యాయి. భవనాలు సిద్ధంగా ఉన్న ప్రాంతంలో వెంటనే ప్రారంభించాలని, భవనాలు లేని చోట సంబంధిత సహాయ సంచాలకులకు ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సూచించింది. వరంగల్‌కు వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, వరంగల్‌కు వెల్‌నెస్ మంజూరుకు కృషిచేసినందుకు రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు మగబుల్ హుస్సేన్, విజయ వడ్నాల, వేణుగోపాల్, సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, సీతారామారావు, బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

కృత్రిమ మేధ కీలకం

కేయూ క్యాంపస్: రాబోయే రోజుల్లో వివిధ రకాలుగా కృత్రిమ మేధ ప్రభావం చూపనుందని కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. రెండు రోజులుగా హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏఐకి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాల్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ బైరం ఆనంద్ మాట్లాడుతూ.. అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా భారతదేశంలో రిటైల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఎలా జరుగుతుందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కామర్స్ విభాగాధిపతి సారంగపాణి, అధ్యాపకులు సురేశ్‌బాబు, సుమలత, సురేశ్, మధు, యుగేందర్, సామ్యూల్ ప్రవీణ్‌కుమార్, రాజేశ్వరి, సునీత, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.